

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఆనంద్, గెల్లు

# రాష్ట్రంలో విద్యారంగం సర్వనాశనం

**రాష్ట్రంలో గురుకులాలను భారీగా పెంచిన ఘనత కేసీఆర్‌దే**

- బీహార్ స్కూళ్ల గురించి మోదీకి లేఖ రాసిన రాహుల్.. తెలంగాణ స్కూళ్ల పరిస్థితిపై కూడా లేఖ రాయాలి
- బీహార్ కంటే అధ్వాన్నమైన స్థితిలో తెలంగాణ స్కూళ్లు
- యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో మోసం
- కాంగ్రెస్‌ది ఫొటోషాప్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి పాలనలో విద్యారంగం సర్వనాశనమైందని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీహార్‌లోని ఒక పాఠశాలలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయంటూ మోదీకి లేఖ రాసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తెలంగాణలోని స్కూళ్ల దుస్థితి గురించి కూడా ప్రధానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. బీహార్ కన్నా.. తెలంగాణ పాఠశాలల్లో ఘోరమైన పరిస్థితులు ఉన్నాయని దుయ్యబట్టారు. ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికలు నానా ఇబ్బందులు పడుతున్నారని, తరగతి గదుల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

### కేసీఆర్ హయాంలో వెలుగు వెలిగిన విద్యారంగం

కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ ఒక వెలుగు వెలిగిందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్రంలో మొత్తం 300 గురుకులాలు ఉంటే, కేసీఆర్ సీఎం ఆయిన తర్వాత అదనంగా 660 గురుకులాలు ఏర్పాటుచేశారని వివరించారు. వాటితోపాటు సైనిక్‌స్కూళ్లు, లా, ఫార్మసీ, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి కాలేజీలు ఏర్పాటుచేయడంతోపాటు అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి 20 లక్షల రూపాయలు ఇచ్చి విదేశాలకు పంపించిన చరిత్ర కూడా కేసీఆర్‌దేనని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ లేకుండా విద్యార్థులు ఏఐ ఎట్లా నేర్చుకుంటారని ఆయన ప్రశ్నించారు.

### కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్ పథకానికీ మంగళం

పాఠశాల విద్యార్థుల కోసం కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్, మౌలిక వసతుల కోసం 'మనఊరు-మనబడి' పథకం ద్వారా రూ.17వేల కోట్లతో 28 వేల స్కూళ్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ సర్కారు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని, విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫొటోషాప్ ప్రభుత్వంగా మారిందని ఎద్దేవా చేశారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పనులు ప్రారంభం కాలేదని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో కూడా ఒక్క ఇటుకను కూడా వేయలేదని దుయ్యబట్టారు. ఇవన్నీ రాహుల్‌గాంధీకి కనిపించడం లేదా? అని నిలదీశారు.

### ఎవరి టాయిలెట్లు వారే కడుక్కోవాల్నా?

స్కూళ్లలో శానిటేషన్ దారుణంగా ఉన్నదని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. విద్యార్థులే.. ఎవరి టాయిలెట్లు వారు కడుక్కోవాలని ఒక ఐఏఎస్ అధికారి అనడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆ ఐఏఎస్‌కు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. సర్దుబాటు పేరుతో రాష్ట్రంలో అనేక స్కూళ్లను మూసి వేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ నాయకులు నాయిని రాజేందర్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, అది మంచిది కాదని హెచ్చరించారు. తాము వారి మాదిరిగా సచివాలయంలో కూర్చొని కమీషన్ల కోసం ఆరాటపడటం లేదని, ఢిల్లీకి మూటలు మోసే సంస్కృతి బీఆర్‌ఎస్‌కు లేదని స్పష్టంచేశారు.

# గల్లీలో దండాలు.. ఢిల్లీలో దండాలు

## రేవంత్‌రెడ్డే తెలంగాణ శత్రువు • సీఎం, బీజేపీ ఒక్కటే: వేముల

- బీజేపీ ఎంపీలను గెలిపించడం కోసమే వీక్ అభ్యర్థులను నిలబెట్టిన రేవంత్‌రెడ్డి
- 8 మంది బీజేపీ ఎంపీల్లో ఏడుగురిని గెలిపించిన ఘనత ఆయనకే దక్కింది
- బీజేపీ ఎంపీలున్న నియోజకవర్గాల్లో సర్కారు మంత్రి పదవులు ఇవ్వలే
- ఓటుకు నోటు కేసు ఎటు పోయింది?
- రేవంత్‌ను నమ్ముకుంటే కాంగ్రెస్ ఖతమే
- కేసీఆర్ తెలంగాణకు ఆత్మ
- మాయమాటలు చెప్పే పిట్టలదొర రేవంత్
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గల్లీలో దండాలు చేస్తూ.. ఢిల్లీలో గులాంగిరీ చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డే అసలైన శత్రువు అని దుయ్యబట్టారు. ఢిల్లీలో రెండు రోజులు పడిగాపులు కాసినా పార్టీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ దొరకలేదన్న ఫ్రస్టేషన్‌లో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక్కటేనంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. నిజానికి రేవంత్‌రెడ్డి, బీజేపీ ఒక్కటే అని, వారి దోస్తానా చాలా సార్లు బయటపడిందని పేర్కొన్నారు.

### బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, కానీ కాంగ్రెస్‌కు మాత్రం ఢిల్లీ ప్రయోజనాలే ముఖ్యమని వేముల పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీలు గెలిచి ఉంటే.. తెలంగాణకు ఈ గతి పట్టేదా? అని ప్రశ్నించారు. మంత్రుల శాఖల కేటాయింపులో కూడా ఏమీచేయలేని నిస్సహాయక స్థితిలో ఉన్న ముఖ్యమంత్రి.. తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీలో మోకరిల్లేలా చేస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల్లో కాళేశ్వరంపై మాట్లాడుతానని అంటున్న రేవంత్‌రెడ్డీ.. అబద్ధాలతో కాళేశ్వరంపై ప్రజంటేషన్ కోసం వంటకం ఇంకా సిద్ధం కాలేదా? అని ప్రశ్నించారు.

### ఎంతమందిని జైల్లో పెడతవ్?

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ పార్టీ నేతలను అరెస్టు చేసి, జైల్లో పెట్టాలన్న ఆలోచనే తప్ప.. పాలన మీద దృష్టి సారించారా? అని ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. కేసులు ఎలా పెట్టాలన్న అంశంపై కేటాయించే సమయాన్ని పాలనపై పెడితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని హితవు పలికారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు 60 లక్షల మంది ఉన్నారు.. ఎంతమందిని జైల్లో పెడుతావని ప్రశ్నించారు. ఎంత మందిని జైల్లో పెట్టినా.. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. హామీల అమలు విషయంలో.. సీఎం రేవంత్‌రెడ్డి పిట్టలదొర మాదిరిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా బీఆర్‌ఎస్ వెంటపడుతూనే ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, పార్టీ నాయకులుడు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### రేవంత్‌ను నమ్మకండి


కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పనిచేస్తూ, బీజేపీతో సఖ్యతగా ఉంటున్న రేవంత్‌రెడ్డిని నమ్మవద్దని కాంగ్రెస్ నేతలకు ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఆయన ఏదో ఒకరోజు కాంగ్రెస్‌ను ఖతం చేసి, నాయకులను నట్టేట ముంచి.. బీజేపీలో చేరిపోవడం ఖాయమని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసు ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు.

### కేసీఆర్ తెలంగాణ ఆత్మ

కేసీఆర్ తెలంగాణ ఆత్మ అని వేముల ప్రశాంత్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణకు అసలు శత్రువు రేవంత్‌రెడ్డి అని నిప్పులు చెరిగారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టింది తమరు కాదా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు నీటిని తరలించుకుపోతుంటే.. నోరు మూసుకున్న రేవంతే.. తెలంగాణకు అసలు శత్రువు అని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ స్థానానికి, జీడీపీలో 4వ స్థానంలో ఉంటే.. 11వ స్థానానికి దిగజార్చిన తెలంగాణ శత్రువు తమరే అని మండిపడ్డారు. తెలంగాణ అప్పులపాలైందని, సీఎం హోదాలో ఢిల్లీకి వెళ్తే అక్కడ దొంగలా చూస్తున్నారంటూ రాష్ట్రం పరువు తీస్తున్న రేవంత్‌రెడ్డే తెలంగాణకు శత్రువు అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీకి కలిపి మొత్తం 16 మంది ఎంపీలున్నా.. కేంద్రం నుంచి తెలంగాణకు తెచ్చింది గుండుసున్నా అని దుయ్యబట్టారు. అదే 16 మంది ఎంపీలు బీఆర్‌ఎస్‌కు ఉన్నట్టయితే, ఏపీ మాదిరిగానే తెలంగాణకు నిధుల వరద పారేదని స్పష్టంచేశారు. ఏపీకి నిధులిస్తున్న కేంద్రం నుంచి తెలంగాణకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని అసలు శత్రువులు కాంగ్రెస్, బీజేపీలేనని అగ్రహం వ్యక్తంచేశారు.

### బీజేపీ ఎంపీలున్నచోట మంత్రి పదువులు ఇవ్వలేదు

మల్కాజిగిరి, సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ వంటి ఎంపీ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు కోసం కాంగ్రెస్ నుంచి బలహీనులైన అభ్యర్థులను నిలబెట్టారని, ఇప్పుడు ఆయా నియోజకవర్గాల పరిధిలో ఒక్కరికి కూడా మంత్రి పదవులు ఇవ్వలేదని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ ఒక్కటేనని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిపై బీజేపీ నేతలు ఈగ కూడా వాలనీయడం లేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ స్వయంగా ఎన్నికల ప్రచారంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తున్నదని ఆరోపించినా.. ఇప్పటివరకు దానిపై ఎందుకు విచారణ జరపడంలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ లభించకపోయినా, ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ మాత్రం 15 నిమిషాల్లోనే దొరుకుతుందని పేర్కొన్నారు. ఇది వారిద్దరి మధ్య స్నేహబంధానికి సాక్ష్యమని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీని తొక్కడానికి రేవంత్‌రెడ్డి, బీజేపీ కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు.





## లోకం పోకడ

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.7°c | 23.6°c |
| రంగారెడ్డి | 37.4°c | 20.9°c |
| నల్లగొండ | 37.0°c | 22.4°c |
| ఖమ్మం | 35.0°c | 26.0°c |
| మెదక్ | 35.0°c | 23.1°c |
| వరంగల్ | 34.0°c | 25.0°c |
| కరీంనగర్ | 33.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 32.7°c | 24.3°c |
| నిజామాబాద్ | 32.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 24.0°c |

# మత్తు వదిలిద్దాం.. ముందుకు రండి!

- రాష్ట్రంలో 14 జిల్లాల్లో మాదకద్రవ్యాల నివారణ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం
- ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తుల కోసం నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 14 జిల్లాలో మాదక ద్రవ్యాల నివారణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గురువారం ప్రకటన విడుదల చేసింది. ప్రైవేటు సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తూ కేంద్ర సామాజిక న్యాయసాధికారతశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 30 వరకు గడువు విధించింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, సూర్యాపేటలో సెంటర్లకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంది. పూర్తి వివరాలకు 040-24559048 నంబర్‌ను, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం https://grants-msje.gov.in/ngo.login పోర్టల్‌ను సంప్రదించాలని సూచించింది.

## ఛత్తీస్‌గఢ్ నీళ్లు వాడుకుంటే ఎలా?

- అప్పుడు జీసీ లింక్ భవిష్యత్తు ఏమిటి?
- టాస్క్‌ఫోర్స్ కమిటీలో నిపుణుల ప్రశ్నలు
- 24న పూర్తిస్థాయిలో చర్చించాలని నిర్ణయం

హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ తన వాటా జలాలను వినియోగించుకుంటే గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టు భవిష్యత్తు ఏమిటని ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులను టాస్క్‌ఫోర్స్ కమిటీ నిపుణులు ప్రశ్నించారు. ఈ నెల 24న నిర్వహించనున్న కన్సల్టెన్సీ సమావేశంలో దీనిపై పూర్తిస్థాయిలో చర్చించాలని నిర్ణయించారు. నదుల అనుసంధాన ప్రాజెక్టులకు సంబంధించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఢిల్లీలో గురువారం ప్రత్యేకంగా సమావేశమైంది. రివర్ లింక్ ప్రాజెక్టుల పురోగతి, అందులో నెలకొన్న అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టుపైనా కమిటీ నిపుణులు చర్చించారని సమాచారం. ఈ సందర్భంగా జీసీ లింక్‌పై పలువురు ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. వాస్తవంగా హిమనీనదాల నుంచి తొలుత జలాలను గోదావరికి, ఆ తరువాత గోదావరి నుంచి కృష్ణా మీదుగా కావేరికి దశలవారీగా తరలించాల్సి ఉంది. కానీ తొలుత గోదావరి-కావేరిని చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తన వాటాలో వినియోగించుకోని 148 టీఎంసీల జలాలను కావేరికి తరలించాలని ప్రతిపాదనలు చేసింది. దీనిపై ఆ రాష్ట్రంతోపాటు గోదావరి బేసిన్‌లోని ఇతర రాష్ట్రాలు సైతం వ్యతిరేకించాయి. తాజాగా జరిగిన సమావేశంలోనూ ఇదే విషయమై చర్చించినట్టు తెలిసింది. ముమ్మందు ఛత్తీస్‌గఢ్ తన వాటా జలాలను వినియోగించుకుంటే జీసీ లింక్ భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జీసీ లింక్‌పై 24వ తేదీన రాష్ట్రాలతో నిర్వహించనున్న కన్సల్టెన్సీ మీటింగ్‌లో చర్చించాలని నిర్ణయించినట్టు సమాచారం.

## నిరుద్యోగులు డీట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- డీట్ డైరెక్టర్ జే రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువతకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ జే రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీట్‌లో ఇప్పటివరకు 75 వేల మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత రిజిస్టర్ చేసుకున్నట్టు వెల్లడించారు. 972కుపైగా కంపెనీలు ఇందులో నమోదు అయినట్టు తెలిపారు. ఐటీ, ఫార్మా, ఇండస్ట్రియల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ మొదలైన రంగాల్లో 10080 ఉద్యోగ ఖాళీలను ప్రకటించాయని స్పష్టంచేశారు. డీట్ ద్వారా 51మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించినట్టు తెలిపారు.

## ఐర్లాండ్‌లో బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్

- అధ్యక్షుడిగా కిరణ్, ప్రధాన కార్యదర్శి పవన్
- పార్టీ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల సమక్షంలో కమిటీ

హైదరాబాద్ జూన్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే 52 దేశాల్లో బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్‌లు ఏర్పాటుచేయగా, తాజాగా ఐర్లాండ్ 53వ దేశంగా బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్‌లో చేరింది. ఐర్లాండ్‌లో బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ పార్టీ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల సమక్షంలో గురువారం కమిటీని ఎన్నుకున్నారు. బీఆర్‌ఎస్ ఐర్లాండ్ ఎన్నారై సెల్ అధ్యక్షుడిగా కిరణ్ అనుగుర్తి, ఉపాధ్యక్షులుగా విశాల్ శిరంశెట్టి, నితీశ్ చిలువేరి, ప్రధాన కార్యదర్శిగా పవన్ అనుగుర్తి, సలహా బోర్డు వైస్ చైర్మన్‌గా ఉమేశ్ చిప్ప, సలహాబోర్డు సభ్యులుగా చానుబోయిని, సూర్యచందన్, నవీన్‌కుమార్ కొండిజు, కార్యదర్శులుగా రాకేశ్ లేసాని, అన్వేశ్‌రెడ్డి, నోమాన్ సయ్యద్, ఐటీ అండ్ పీఆర్ కార్యదర్శిగా సాయి మనీశ్ తాటికొండ, ట్రెజరర్లుగా ఉమేశ్ చిప్ప, ప్రదీప్‌గౌడ్, కమ్యూనిటీ వ్యవహారాల ఉపాధ్యక్షుడిగా పవన్ కల్యాణ్ చిర్రం, అధికార ప్రతినిధులుగా రామకృష్ణ, వేణురెడ్డి, ఉమేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జులుగా పవన్ అనుగుర్తి, దిలీప్‌రెడ్డి, సభ్యత్వ కోఆర్డినేటర్‌గా అభివన్ గడ్డం ఎన్నికయ్యారు.

# మైనార్టీ గురుకులాలకు తాళం

- 14 నెలల భవనాల అద్దె బకాయిలు
- తాళాలేసిన భవన యాజమానులు
- హడావుడిగా ఇతర సొసైటీల్లో విడుదల
- మైనార్టీ గురుకులాల్లో కానరాని స్పందన
- అన్ని గురుకులాల్లో 400 కోట్ల బకాయిలు

హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ): ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 14 నెలలుగా గురుకులాల భవనాల కిరాయిలు చెల్లించని వైనం.. పలుమార్లు నిరసనలు.. తాళాలేస్తామని యజమానుల అల్టిమేటం.. ఖాతరు చేయని ప్రభుత్వం.. ఫలితంగా నేడు ప్రారంభంరోజే రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకులాల భవనాలకు యజమాన్యాలు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే సోమవారం లోగానైనా అద్దెలను చెల్లించాలని యజమాన్యాలు ఈ సందర్భంగా మరోసారి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతోపాటు, ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లన్నీ దాదాపు 750 వరకు కిరాయి భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా భవనాలకు చెల్లించాల్సిన కిరాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని నెలలుగా నిలిపేసింది. ఒక్కో భవన యజమానికి సగటున రూ.20 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు బకాయిలను చెల్లించాల్సి ఉన్నది. మొత్తంగా రూ.400 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని తెలుస్తున్నది.

### భవన యాజమానుల పోరుబాట

ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం, మరోవైపు భవనాలను నిర్వహించలేక యజమానులు పోరుబాట పట్టారు. కిరాయిలు చెల్లించాలని, లేదంటే ఖాళీ చేయాలని నోటీసులు కూడా జారీచేశారు. అయినా స్పందన లేకపోవడంతో 12వ తేదీలోగా బకాయిలను చెల్లించకుంటే తాళాలు వేస్తామని, భవనాలను స్వాధీనం చేసుకుంటామని మరోసారి అల్టిమేటం జారీచేశారు. అయినా సర్కారులో చలనంలో లేకుండాపోయింది. దీంతో గురువారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకుల భవనాలకు సంబంధిత యజమానులు తాళాలు వేశారు.

### ఇతర సొసైటీల అప్రమత్తం

రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకులాల భవనాలకు యాజమాన్యాలు తాళాలేసిన సమాచారం తెలుసుకున్న మిగతా సొసైటీల ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. బీసీ గురుకుల సొసైటీలో 10 నెలల బకాయిలకు గాను వెనువెంటనే 4 నెలల కిరాయి చెల్లించారు. ఎస్సీ గురుకుల సొసైటీలో 18 నెలల బకాయిలకు 3 నెలల కిరాయి చెల్లించారు. మైనార్టీ సొసైటీలో 14 నెలల బకాయిల్లో ఒక్క నెల కూడా చెల్లించకపోవడం గమనార్హం.





హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల గేటుకు యజమాని తాళం వేయడంతో బయటే వేచి ఉన్న టీచర్లు, సిబ్బంది

## గురుకులాలను గాలికొదిలేసిన సర్కార్

- బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకులానికి తాళం ప్రభుత్వ అసమర్థత: ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూన్12: రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ గురుకులాలను గాలికొదిలేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి మైనార్టీ పాఠశాలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ గురుకుల పాఠశాలలో మొత్తం 370 మంది విద్యార్థులు చదువుతున్నారు. 13 నెలల కిరాయి చెల్లించకపోవడంతో భవన యజమాని పాఠశాల భవనానికి తాళం వేశారు. దీంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది గేటు బయటే గంటలపాటు పడిగాపులు కాశారు. 5 నెలల అద్దె బకాయి చెల్లిస్తామని చెప్పడంతో మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం తెరిచారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాఠశాలకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. ఇలాంటి ఘటన గతంలో ఎన్నడూ జరగలేదని, కాంగ్రెస్ సర్కార్ అసమర్థత వల్ల గురుకులాల్లో ఈ పరిస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు.



అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపాల్

## తొలిరోజే 'బాలా'రిష్టాలు





పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు.. విద్యార్థులే పనులు చేసుకోవాల్సి వచ్చింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను 'నమస్తే తెలంగాణ' గురువారం ఉదయం పరిశీలించగా, పిల్లలు బెంచీలు మోయడం, మామిడి ఆకులు తెంపి తోరణాలు కట్టడం కనిపించింది.

-నిజామాబాద్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## నేడు సీపీగెట్ నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడీ, ఎంపీఈడీ ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే టీజీసీపీజీఈటీ-2025 ఎంట్రన్స్ పరీక్ష నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేయనున్నది. ఈ మేరకు గురువారం టీజీసీపీజీఈటీ-2025 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ఒక ప్రకటన విడుల చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ కుమార్ మొలుగరామ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, వీరనారి చాకలిఐలమ్మ, జేఎన్టీయూల పరిధిలో నోటిఫికేషన్ విడుదల వెలువడనున్నదని స్పష్టంచేశారు.

## ఈ ట్రాక్టర్ల భారం భరించలేం



ట్రాక్టర్ల నిర్వహణ తమతో కాదని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. ఈ ఆర్థిక భారాన్ని మోయలేంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని జీపీ కార్యదర్శులు గురువారం పంచాయతీ ట్రాక్టర్ల తాళంచెవిలను ఎంపీవో ప్రసాద్‌కు అప్పగించారు. అప్పు చేసి ట్రాక్టర్ల నిర్వహణ చేపడుతున్నామని, ఇక తమవల్ల కాదని తేల్చి చెప్పారు.

- మహదేవపూర్